# తనకు చెందని న్యాయం

**అయ్యగారి సుబ్బలక్ష్మి**

"**హలో...** ఎవరూ?..."

"నేనండి ... రమని ..."

"హాఁ ... బిందు ఇంట్లో లేదమ్మా ... వాళ్ళమ్మతో షాపింగ్‌కి వెళ్ళినట్లుంది."

"నేను ఫోన్ ..."

రమ మా... పూర్తి కాకుండానే మధ్యలోనే అందుకుని "అలాగే—రాగానే చెప్తాలేమ్మా ..."

"నేను మీతోనే మాట్లాడాలి... అంకుల్ ... అందుకనే ఫోన్ చేశాను. మీరు ఫ్రీగా ఉంటే నేను వచ్చి వివరంగా మాట్లాడుతాను" అంది గబగబా.

"నాతోనా ..." కించిత్తు ఆశ్చర్యం ధ్వనించింది ఆయన గొంతులో.

"ఏ విషయం గురించి?!" ఆసక్తిగా అడిగారు.

"కొంచెం ముఖ్యమైన విషయం గురించే ... మీరు ఫ్రీగా ఉంటే ఇప్పుడే వస్తానంకుల్ ..." అభ్యర్థిస్తున్నట్లు అడిగింది.

ఒక్క క్షణం ఆలోచించి, కాదనడానికి తగినంత కారణం దొరకనట్లుగా, అదీకాక కూతురి ఫ్రెండ్ తనతో అంతగా చనువు లేకపోయినా తనతోనే మాట్లాడాలనుకునే విషయం తెలుసుకోడం ఎక్కువ ఆసక్తిగా అనిపించి —

"సరే ... రామ్మా! నాలుగు గంటల దాకా ఇంట్లోనే ఉంటాను" అన్నారు.

"ఇప్పుడే వస్తా నంకుల్ ..."

ఫోన్ పెట్టేసి ... ఆలోచనలో పడ్డారు రావు గారు. రమ మాట్లాడబోయే విషయం ఏమై ఉంటుందో వూహించడం మొదలు పెట్టిన కొద్ది సేపట్లోనే ఆయనకి విషయం అర్థం అయిపోయింది.

అదే ఆయనలో ఉన్న నేర్పు. మనిషిని కొద్దిగా పరికించి చూడగానే అవతల మనిషి బలహీనతలు ముందుగా పసికట్టేసి ... ఆ బలహీనతలో మనిషి ఎలా ప్రవర్తిస్తాడో అంచనా వేయడం ఆయనకి ఒక వ్యసనం.

రమ గురించి ఆలోచించడం మొదలుపెట్టగానే ఆయనకి మొదట తట్టిన విషయం—కుటుంబానికి పెద్దపిల్ల, గ్రాడ్యుయేషన్ మొన్ననే రాసింది. టైపు, షార్ట్ హేండ్ పాసైంది. ప్రస్తుతం కావల్సింది ఉద్యోగం ... టూకీగా ఇదీ ఆయన అంచనా.

'సరే ... రానీ ...' అనుకుని పనిలో మునిగి పోయారు.

అరగంట తర్వాత—

రమ మెల్లగా ఆయన ఆఫీసు రూమ్‌లోకి అడుగుపెడుతూ —

"నమస్తే, అంకుల్ ..." అంది.

పెన్ స్టాండ్‌లో ఉంచుతూ—

"నమస్తే ... రామ్మా ... కూర్చో" అన్నారు ఎదురుగా ఉన్న కుర్చీ చూపిస్తూ.

పొందికగా కూర్చుంది.

విశ్రాంతిగా కుర్చీలో వెనక్కి వాలుతూ—

"వూఁ! సంగతేమిటో చెప్పు" అన్నారు సూటిగా విషయానికి వస్తూ.

"ఉద్యోగం కావాలి, అంకుల్." అంతే. సూటిగా అడిగింది నవ్వుతూ చాక్‌లెట్ కావాలన్నంత ఈజీగా.

ఒక్క క్షణం— గర్వంతో కూడిన చిరునవ్వు మొహంలో కదలాడింది తన అంచనా తప్పనందుకు.

గబగబా జేబులు వెతుక్కున్న రావుగారిని అడిగింది రమ—

"ఏమిటి, అంకుల్, వెతుకుతున్నారు?"

"ఉద్యోగం..." అన్నారు వెతకడం ఆపి నవ్వుతూ.

రమకి కూడా నవ్వొచ్చింది.

కానీ ... నవ్వుతో తేలగొట్టాల్సిన విషయం కాదు గాబట్టి వెంటనే ...

"అంత హాస్యంగా తీసుకోకండి, అంకుల్! మీకు తెలియనివి కాదు కదా మా ఇంటి పరిస్థితులు. ఈ సంవత్సరం తమ్ముడు డిగ్రీ కోర్సులో చేరాలంటే నాకు జాబ్ తప్పనిసరి. నా క్వాలిఫికేషన్స్‌కి తగినట్లు మీరు ఎక్కడ ఇప్పించ గలిగినా ఎంతో మేలు చేసిన వాళ్ళవుతారు." ప్రాధేయ పూర్వకంగా అడిగింది రమ.

రావుగారు మాట్లాడబోయేంతలో —

"హాలో, రమా! ఎంతసేపయింది వచ్చి?!" అంటూ రమ పక్కనే మరో కుర్చీలో కూర్చుంటూ అడిగింది బిందు.

"ఇప్పుడే, బిందూ! పది నిమిషాలయి ఉంటుందంతే." రమ చేతిని ఆప్యాయంగా తన చేతిలోకి తీసుకుంటూ అంది.

"ఏమిటి, డాడీ... ఏదో మేలు, మేలు అంటోంది రమ?" తమాషాగా తల వంచి రహస్యం అడుగుతున్నట్టుగా అడిగింది.

రావుగారికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా రమ వెంటనే —

"ఉద్యోగం గురించి, బిందూ! ... అంకుల్ కొంచెం పెద్ద పోస్ట్‌లో ఉన్నారు కదా! ... ఎక్కడైనా ఇప్పించలేకపోరా అన్న ధైర్యంతో మొట్టమొదట ఇక్కడికే వచ్చాను."

"గుడ్ ... ఇంక నువ్వు ఉద్యోగస్థురాలివి— కాబోలు. ఇదిగో—జాబ్ వచ్చాక నాకు వారాని కోసారి పార్టీ...అది కూడా నేనడిగే రీతిలో ఇవ్వాలి—తెలుసా? ముందే చెప్తున్నాను. కాబట్టి తర్వాత తప్పించుకో కూడదు. ఒప్పుకున్నట్లేనా?!" అధికారదర్పం ప్రదర్శిస్తూ అడిగింది ఠీవిగా కుర్చీ నుంచి కదిలి.

నవ్వింది రమ — బిందు చిలిపితనానికి.

తనూ అలాగే నటిస్తూ చేతులు నలుపుకుంటూ వినయంగా—

"అలాగేనండీ ... తమరేం చెయ్యమంటే అదే చేస్తాను. కానీ ఒక్క విషయం మనవి చేసుకోనా?" అంది.

చేసుకోమన్నట్లు తలాడించింది సీరియస్ ఫేజులో

"నేను జాబ్ కుటుంబంకోసం చేస్తానంటున్నాను కానీ, జల్సాగా ఖర్చుచేయడానికి కానీ, కాలక్షేపానికి కానీ కాదని గుర్తుచేస్తున్నాను."

"వో కె... వో కె! డాడీ! రమ కేసు కొంచెం టేకప్ చెయ్యండి" అంది రికమెండ్ చేస్తూ.

"ఒట్టిగా కాదంకుల్— ఎలాగైనా ఇప్పించి తీరాలి" అంది నమ్మకంగా, 'మీరు తప్పించుకో లేరు' అన్నట్లు.

"చూడు, రమా... ఎంత అధికారం ఉన్నా ఉద్యోగం... మాటలు కాదు. ఎక్కడో అక్కడ చిన్న చిన్న ఉద్యోగాలకి తొందరపడడం కన్నా, మంచి జాబ్‌లో చేరితే బాగుంటుంది. అయినా పెళ్ళి చేసుకుని ఇల్లు చక్కదిద్దుకోవాల్సిన వయసులో ఇలా జాబ్‌కి సిద్ధపడితే చివరికి నీ పెళ్ళే పెద్ద సమస్య అయి కూర్చుంటుంది."


"ఇప్పుడు పెళ్ళి ముఖ్యం కాదు కదా, అంకుల్?"

"అవుననుకో ... ఇప్పుడు కాకపోయినా రెండు మూడేళ్ళ తర్వాత అదే ముఖ్యమైనప్పుడు, నెలనెలా రాబడి వదులుకోలేక, అలాగని పెళ్ళి చెయ్యకుండా ఉండలేక మీ ఫాదర్‌కి పెద్ద పజిల్ అయి కూర్చుంటావు.సంసారానికి ఆసరాగా ఉన్నావు కదా అని నీ పెళ్ళికి మీ ఫాదర్ తొందరపడకపోయినా ఆశ్చర్యపోనక్కర లేదు. ఎన్ని మధ్య తరగతి సంసారాలు చూడటం లేదూ మన చుట్టూ..." నీకు జాబ్ అత్యవసరం కాదన్నట్లు ఆయన మాట్లాడుతున్న ధోరణికి దెబ్బ తిన్నట్లు చూసింది రమ.

"అలా అనకండి, అంకుల్! ఉద్యోగంలో చేరనంత మాత్రాన వెంటనే పెళ్ళి చేసుకుని వెళ్ళిపోగల పరిస్థితులు లేవక్కడ. పెళ్ళి కాకుండా, సంపాదన లేకుండా కుటుంబానికి భారమై, చివరికి నాకు నేనే భారమనిపించే రోజు రాకూడదని నా ప్రయత్నం." సిన్సియర్‌గా అంది రమ.

"ఇప్పుడు సంసారాన్ని ఆదుకోవడం బాధ్యతగా అనిపించినా, తర్వాత భారమైతే ..." క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్నట్లు ఆయన అడిగే తీరుని కట్ చేస్తున్నట్లుగా అంది రమ:

"అంత దూరం ఇప్పుడే ఆలోచించడం ఎందుకంకుల్? ఎలా జరగాలని ఉంటే అలా జరుగుతుంది.



అలాగని నా జాబ్‌ని కర్మ సిద్ధాంతానికి వదిలేయకండి ... ప్లీజ్!''

''నిజమే, డాడీ! రమకి ప్రస్తుతం జాబ్ చాలా అవసరమే. మంచి జాబ్ ఇప్పించండి. పద, రమా. డాడీ తల్చుకుంటే అదేమంత కష్టం కాదు. కదా, డాడీ?!''

''మీ నమ్మకం కాదనే ధైర్యం నాకులేదు. కానీ... ప్రయత్నిస్తాను.''

రావుగారికి రమతో కర్మసిద్ధాంతాన్ని గురించి కాసేపు వాదించాలని ఉంది కానీ ... బిందు టాపిక్ కట్ చెయడంతో వూరుకున్నారు.

అయినా ప్రతి ఒక్కళ్ళు ఉద్యోగాలకి సిద్ధమై పోతూంటే ఎన్ని ఉద్యోగాలు ఉంటాయి— అనుకున్నారు. నిజానికి రావుగారికి రమ జాబ్ సీరియస్‌గా తీసుకోవాల్సినంత అవసరం కనిపించకపోవడం పెద్ద వింతేం కాదు.

ఎవరికైనా, ఏదైనా సహాయం చేయాల్సి వచ్చినప్పుడు లాభనష్టాల పట్టికలో లాభం ఎక్కువ కనిపిస్తేనే — అదీ ... సెంటిమెంటల్‌గా కాకుండా ప్రాక్టికల్‌గా ఉంటేనే చెయ్యడం అలవాటు.

రమ పదిహేను రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు రావుగారిని కలిసి అడిగినా, చూస్తున్నాను, చూస్తున్నాను అన్నారే కానీ సీరియస్‌గా పట్టించుకోలేదు.

కనీసం బిందు చూపించేంత శ్రద్ధ, ఆసక్తి కూడా కనబరచక పోయినా — అది కనిపెట్టలేనంత జాగ్రత్తగా — తాత్సారం చేసేస్తున్నారు రావుగారు.

• • • •

తండ్రికి మధ్యాహ్నపు టీ, బిస్కెట్స్ తీసుకొస్తున్న బిందుకి తండ్రి ఫోన్లో ఎవరితోనో మాట్లాడ్డం వినిపించింది.

''ఆఁ... సరదాగా నేర్చుకుంది కానీ సర్టిఫికెట్లు లేవు. ఎలాగైనా పని కదా కావల్సింది. దానికేం సందేహం అక్కర్లేదు. అంతా మీ మీదే ఆధారపడి ఉంది కదా?! ఏం చేస్తారో?! మీ ఇష్టం'' అంటూ ఒక్క నిమిషం అవతల మనిషి చెప్పేది విని ఫోన్ పెట్టేశారు.

టీ టేబిల్ మీద పెడుతూ అడిగింది బిందు:

''ఏదో జాబ్ గురించి అనుకుంటాను ...'' సందేహంగా ఆగిపోయింది.

''ఆఁ! అవును'' అంటూ విషయం పొడిగించడం ఇష్టం లేదన్న భావం మొహంలో స్పష్టంగా వ్యక్తం చేశారు.

బిందు వెళ్ళిపోయింది మవునంగా.

రెండు రోజుల తర్వాత —

ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగానికి అప్పాయింట్ మెంట్ ఆర్డరు ఎంతో ఆనందంగా తనకి ఇస్తూంటే విస్మయంగా చూసింది బిందు.

''ఇదేమిటి?!''

''నీకు ఉద్యోగం —''

''నా కెందుకు, డాడీ?!...'' అయోమయంగా అడిగింది. పొత్తిగా అర్థంకాని పాఠం చదివిన విద్యార్థి మొహంలా ఉంది బిందు పరిస్థితి.

''చూడమ్మా, బిందూ! ఇప్పటి సామాజిక పరిస్థితి ఎలా ఉందంటే, ఎంతొచ్చినా నిశ్చింత అనేది కలగడం కష్టం. నన్నే చూడు—బాదరబందీ లేకపోయినా, ఏమాత్రం మిగల్చ గలిగాను? చెప్పుకోతగ్గంత ఆస్తి నిలవ చేయలేకపోయాను. రేపు నీ పెళ్ళి ఏ డాక్టరుతోనైనా చేసినా, అతడు సంపాదించేది నిత్యావసరాలకే సరిపోతుంది. సొసైటీలో కొంచెం మెరుగ్గా కనిపించాలంటే ...''

''ప్లీజ్... స్టాపిట్, డాడీ!'' అసహనంగా అంది బిందు, మొహంలో అయిష్టాన్ని స్పష్టంగా వ్యక్తం చేస్తూ.

''మనకి ఏ అవసరమూ తీర్చని సొసైటీకోసం నేను జాబ్ చేయాలా?! నిత్యావసరాలకోసం, తన తోబుట్టువు తన కాళ్ళ మీద తను నిలబడడానికి చేయూత నివ్వాలనుకొంటున్న రమ మరో ఆర్నెల్లో, సంవత్సరమో జాబ్‌కోసం తిరగాలా?! ఇదేనా మీకు తెలిసిన న్యాయం?! నా దృష్టిలో మనిషిగా నిలబడాలని మీ రనుకుంటే — ఈ జాబ్ రమకి ఇప్పించండి. నేనుమాత్రం జాబ్ చెయ్యబోవడం లేదు. తర్వాత మీ ఇష్టం.'' అప్పాయింట్‌మెంట్ ఆర్డర్ అక్కడున్న టీపాయ్ మీద పడేసి లోపలికి వెళ్ళిపోయింది.

తనకి లేని సంస్కారం తన రక్తం పంచుకున్న కూతురిలో కనిపిస్తూంటే, వింతగా చూస్తూండి పోయారు రావుగారు. ✱